బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

కర్నూల్‌లో చిన్నహుస్సేన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 15 : అలంపూర్ నియోజకవర్గంలో పలు మండలాలకు చెందిన కొందరు అనారోగ్యంతో కర్నూల్‌లో దవాఖాల్లో వైద్యం చేయించుకుంటున్న బాధితులను మంగళవారం ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. మానవపాడుకు చెందిన చిన్న హుస్సేన్, ఇటిక్యాల మండలం వావిలాల గ్రామానికి చెందిన పూల బాషా అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న వారిని ఎమ్మెల్యే విజయుడు వెళ్లి వారిని, కుటుంబ సభ్యులను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట హుస్సేన్, గోపాల్, రంగారెడ్డి, క్రాంతిరెడ్డి, రాము, రఘురెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అరిగోస తప్పదా ?

- రైతు శ్రేయస్సును మరిచిన స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్
- మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ ఆరోపణ

దుప్పల్లి రైతులతో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్

మదనాపురం, ఏప్రిల్ 15 : ఆరుగాలం కష్టపడి పంట పండించే అన్నదాతకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అరిగోస తప్పేటట్టు లేదని మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని దుప్పల్లి లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రధాన రైతులు ఇప్పటి వరకు తమ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదని బీఆర్ఎస్ నాయకులతో మొరపెట్టుకున్నారు. 15-20 రోజుల నుంచి వరి కోతలు జరుగుతున్నాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తేమశాతం ఉన్నా ఎందుకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి వరి పంటలను పండించిన రైతులకు స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ డ్డి కన్నీళ్లు తెప్పిస్తున్నాడని ఆరోపించారు. రైతులు ధాన్యాన్ని వసతి లేక రోడ్లపై ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని, రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాన్ని ఎందుకు ఏర్పాటు చేయడం లేదో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. మండలంలో పెద్ద గ్రామ పంచాయతీ అయిన దుప్పల్లిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేని స్థానిక ఎమ్మెల్యేకు అభివృద్ధిపై అంకితభావంతో పనిచేస్తున్నానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పథకాల పేరుతో పూట గడుపుతూ వాటిని అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, యూత్ అధ్యక్షుడు రాజ్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, మాజీ సర్పంచులు విజయేందర్ రెడ్డి, శివశంకర్ నాయుడు, మండల ప్రచార కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు మాసన్న, భరత్‌రెడ్డి, ప్రవీణ్‌చారి, రాము, యువకులు, రైతులు పాల్గొన్నారు.

ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు

- బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

మాట్లాడుతున్న కుర్వ పల్లయ్య

అయిజ, ఏప్రిల్ 15 : కాంగ్రెస్ సర్కారు పదహారు నెలల్లో ఒక్క నోటిఫికేషన్ కూడ ఇవ్వలేదని బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. 6 పోస్టులను భర్తీ చేసి 57వేల ఉద్యోగాలను ఇచ్చినట్లు రేవంత్ సర్కార్ పోజులు కొడుతుందని మండిపడ్డారు. మంగళవారం ఆయన అయిజ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ఇచ్చిన నోటిఫికేషన్ల పోస్టులను భర్తీ చేసి కాంగ్రెసు సర్కారు నోటిఫికేషన్లు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో జరిగిన పరీక్ష ఫలితాలు ప్రకటించి తామే భర్తీ చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జాబ్ క్యాలెండర్‌పై ఉపముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటన చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా నిరుద్యోగులను నిండా ముంచారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్‌వీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో చిన్న, రాజు పాల్గొన్నారు.

చలో సెక్రటేరియేట్ బ్రోచర్ విడుదల

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

వనపర్తి టౌన్, ఏప్రిల్ 15 : జీవో నెంబర్ 21ని రద్దు చేసి సహాయ ఆచార్యుల నియామకాన్ని చేపట్టాలని పార్ట్‌టైం ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీజీ కళాశాల ఆవరణలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో సెక్రటరియేట్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ పార్ట్‌టైం ఫ్యాకల్టీకి ఏ విధమైన సర్వీసు ప్యాకేజీ ఇవ్వకపోవడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 17వ తేదీన గురువారం చలో సెక్రటరియేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు నిరంజన్, మహేందర్, సంజీవ్‌కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్, రాఘవేంద్ర ప్రసాద్, శ్రీశైలం, యువరాజు, రాఘవేంద్ర ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, MOHAMMED UMAR IBRAHIM S/o MOHAMMED IBRAHIM, Passport No : E 2321825, R/o : 1-5-39/4, New Town, Mahabub Nagar - 509001. Changed my name as MOHAMMED OMAR IBRAHIM.

NT-MBNR

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో కలెక్టరేట్ సూపరింటెండెంట్‌తో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించడంపై సమీక్ష నిర్వహించారు. భూభారతి చట్టం-2025పై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఏప్రిల్ 17వ తేదీ నుంచి మండలాల వారీగా రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టంపై అవగాహన అనుమానాలు నివృత్తి చేయాలని సూచించారు. ధరణి స్థానంలో వచ్చిన భూభారతి చట్టం-2025తో ఒకేరోజు రిజిస్ట్రేషన్ తో పాటు మ్యుటేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్ , మ్యుటేషన్ చేసే ముందు సంబంధిత భూమి సర్వే చేసి మ్యాప్ తయారు చేస్తారని, తాసీల్దార్ ద్వారా భూ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యుటేషన్ చేస్తారని తెలిపారు. అదేవిధంగా ప్రతి రిజిస్ట్రేషన్ భూమికి పట్టాదార్ పాస్ పుస్తకంలో హద్దులతో కూడిన చిత్రపటం ఉంటుందని భూదాన్ యూనిక్ గుర్తింపు నెంబర్ కేటాయిస్తారని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం భూభారతి చట్టంలో కల్పించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పనితీరు అద్భుతం

జిల్లాలో మిషన్ మధుమేహ, వంద రోజుల టీబీ సర్వే కార్యక్రమాలు విజయవంతం చేయడంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అద్భుతంగా పనిచేశారని కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రశంసించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మిషన్ మధుమేహ కార్యక్రమంలో భాగంగా అత్యుత్తమ పని తీరు కనబర్చిన అధికారులు, సిబ్బందికి అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో అహర్నిశలు శ్రమించిన ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్స్‌లకు, ఆశా వర్కర్స్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లాలో 30 ఏండ్లు పైబడిన 3,09,643 మందికి మిషన్ మధుమేహలో భాగంగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో 19,500మందికి డయాబెటిస్ ఉన్నట్లు గుర్తించినట్లు, వారిలో 3వేల మంది కొత్తగా డయాబెటిస్ బారిన పడిన వారు ఉన్నారని గుర్తించినట్లు వివరించారు. 60రోజులపాటు 883మంది వైద్యసిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. దీంతో పాటు 100రోజుల టీబీ సర్వేను కూడా విజయవంతం చేశారని చెప్పారు. జిల్లావ్యాప్తంగా కొత్తగా 753 టీబీ కేసులను గుర్తించినట్లు తెలిపారు. వందరోజుల టీబీ సర్వే కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమ స్థానం సాధించిందని అది సిబ్బంది కృషి వల్లనే సాధ్యమైందని చెప్పారు. ఈ సందర్భంగా గత ఆరు నెలల్లో వైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారికి అవార్డులు ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ మధుమేహ కార్యక్రమంలో అత్యుత్తమ పని తీరు కనబర్చిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ అబ్దుల్ వాసే, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి రామచంద్రరావు, టీబీ సర్వే ప్రోగ్రామ్ అధికారి సాయినాథ్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ మధుమేహ అభినందన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పేదల ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం పంపిణీ

- జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్,ఎమ్మెల్యే, ఎస్పీ

గద్వాల, ఏప్రిల్ 15 : పేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నదని కలెక్టర్ సంతోష్ తెలిపారు. మంగళవారం కేటీదొడ్డి మండలం మల్లాపురంలో లబ్ధిదారుడు సురేశ్‌నాయక్ కుటుంబ సభ్యులతో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సంతోష్ సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిమాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం ఇచ్చే సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ తమ ఇంటికి కలెక్టర్,ఎమ్మెల్యే ,అధికారులు భోజనానికి రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, తాసీల్దార్ హరికృష్ణ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నమూనా పరిశీలన

ధరూరు, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలోని నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నమూనాను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కలెక్టర్ సంతోష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. నిర్మాణం పనులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి నాణ్యమైన పరికరాలు ఉపయోగించి, పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ధరూరు, ఏప్రిల్ 15 : ప్రభుత్వాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో రెవెన్యూ దరఖాస్తులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కుల, ఆదాయ, ఓబీసీ కోసం వచ్చిన సర్టిఫికెట్లను వెంటనే పరిశీలించి చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ భూపాల్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ మంగమ్మ, ఆర్ఐ తేజ పాల్గొన్నారు.

నూతన భవనం మంజూరు చేయాలి

గద్వాల అర్బన్, ఏప్రిల్ 15 : బీసీ బాలుర వసతి గృహానికి నూతన భవనం మంజూరు చేసి, వసతి గృహంలో ఉన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న సమస్యలపై కలెక్టర్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బాలుర కళాశాల వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందని, పైభాగం పెచ్చులూడి విద్యార్థులపై పడుతుందని, అలాగే పర్మినెంట్ ఉద్యోగులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాచ్‌మెన్, ఏఎన్ఎంహెల్పర్ పోస్టులు మంజూరు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వీరేశ్, నర్సింహ, పవన్ కల్యాణ్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

17న జాబ్‌మేళా

వనపర్తి టౌన్, ఏప్రిల్ 15 : వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 17 తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే నిరుద్యోగులు 18-35 ఏండ్ల వయసు కలిగి ఉండి ఎస్ఎస్సీ, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ కలిగి ఉండాలన్నారు. ఎంపికైన నిరుద్యోగులకు హైదరాబాద్‌లోని వివిధ కంపెనీల్లో శిక్షణ అనంతరం ఉద్యోగాలు ఇస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9175305435, 7799073053, 9948568836 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

గట్టు, ఏప్రిల్ 15 : గట్టు బస్టాండ్‌లో శిథిలావస్థలో ఉన్న స్తంభాన్ని తొలగించి, కొత్తది ఏర్పాటు చేయనున్నట్లు ఏడీవో గోవిందు, ఏఈ చిన్నయ్య మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా విద్యుత్ వైర్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో గట్టులో 16వ తేదీ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు వారు చెప్పారు. ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని వారు కోరారు.

ఉపాధి కూలీలకు అవగాహన

మల్దకల్, ఏప్రిల్ 15 : మండలంలోని మంగంపేటలో ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ ప్రతినిధి ప్రకాశ్ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం నుంచి మధ్యాహ్నం 11గంటల వరకే కూలీ పనులకు వెళ్లాలని సూచించారు. కూలీలకు సమస్యలు వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గోపినాయక్, ఉపాధి మేటీలు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

దళారులకు అమ్మి నష్టపోవద్దు

కొత్తకోట, ఏప్రిల్ 15 : మండలంలోని సంకిడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేముల శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బీచుపల్లి యాదవ్, చర్లపల్లి శేఖర్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దమందడి, ఏప్రిల్ 15: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మంగంపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం నాగమణి, సీసీలు ఆంజనేయులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

గద్వాల రూరల్,ఏప్రిల్15: అందరివాడు అంబేద్కర్ అని ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చవ్వా వెంకట్‌రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలోని పీజీ కేంద్రంలో బీఆర్ అంబేద్కర్ జయంతి పుస్కరించుకుని మంగళవారం ఏన్ వైకేయస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, విజేతలకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఏన్‌వైకేఎస్ ఇన్‌చార్జి సతీశ్, భాస్కర్, కళాశాల అధ్యాపకులు మంగళగిరి శ్రీనివాసులు, గోపినాథ్ రాథోడ్, గణేశ్, నరేశ్ రెడ్డి, నవీన్ గౌడ్, మహ్మద్ రఫీ, రంగారెడ్డి, వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

ఖిల్లా ఘణపురం, ఏప్రిల్ 15: మండలకేంద్రానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసులు ఈనెల 7వ తేదీన గ్రామంలో జరిగిన సంతలో ఓపో ఏ38 మొబైల్‌ను పొగోట్టుకున్నాడు. మొబైల్ పోయిందని వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అప్లికేషన్ చేసుకున్నాడు. ఆ మొబైల్‌ను పోలీసులు గుర్తించి మంగళవారం స్వాధీనం చేసుకొని బాధితుడికి ఎస్సై శ్రీనివాసులు అందజేశారు. మొబైల్‌ను ట్రేస్ చేసిన కానిస్టేబుల్ లింగంను ఎస్సై అభినందించారు.

వ్యక్తికి రిమాండ్

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 15 : హత్య కేసులో ఓ వ్యక్తికి రిమాండ్ తరలించిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు సాతర్ల గ్రామానికి చెందిన షాలు(35) అదే గ్రామంలోని బీపీఈడీ కాజ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా భార్య నషియా బాను(32)తో గొడవలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని రోజుల కిందట షాలు తన భార్య నషియా బాను రోకలి బండతో తలపై కొట్టగా కర్నూల్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నషియాబాను ఈనెల 4వ తేదీన మృతి చెందింది. మృతురాలి తల్లి మాసుంబీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి సీఐ రవిబాబు, ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం షాలును అరెస్ట్‌చేసి అలంపూర్‌కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా సాట్ మాజీ చైర్మన్ జన్మదిన వేడుకలు

- పీహెచ్‌సీలో గర్భిణులకు బ్రెడ్లు, పండ్ల పంపిణీ

గద్వాల అర్బన్/ గట్టు/మల్దకల్/అయిజ ఏప్రిల్ 15 : తెలంగాణ తొలి బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ జన్మదినాన్ని బీఆర్ఎస్ శ్రేణులు, నడిగడ్డ యువత సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, రోగులకు నాయకులు, కార్యకర్తలు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. గద్వాలలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు నాయుడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మల్దకల్ మండలకేంద్రంలో బీఆర్ఎస్ మండల నాయకులు మధుసూదన్ గౌడ్, వీరేశ్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రేడ్లును పంపిణీ చేశారు. అయిజ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్య, వైద్యపరంగా ఆంజనేయగౌడ్ పేదలకు మంచి సేవలు అందించాడని కొనియాడారు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని, వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆంజనేయ గౌడ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యసిబ్బంది, బీఆర్ఎస్, నడిగడ్డ యువత నాయకులు అంగడి బస్వరాజు, మోహన్ గౌడ్ తిమ్మప్పగౌడ్, రామకృష్ణగౌడ్, నర్సింహులు గౌడ్, లచ్చగౌడ్, వీరేశ్, శేఖర్, శంకర్ గౌడ్, రాజశేఖర్, రామకృష్ణ, తిరుమల్, పుణ్యమూర్తి, మాలరాజు, వీరేశ్, సత్యం నాయుడు, అనిల్, తిమ్మప్ప గౌడ్, మోహన్ గౌడ్, శంకర్ గౌడ్,తిరుమలేశ్, శ్రీరాములు, రామకృష్ణ, తిమ్మప్ప గౌడ్, మధుసూదన్ గౌడ్, సత్యం, మూర్తి, రాజు, అనిల్, నర్సింహులు, చిన్న, శంకర్, కామేశ్,రామకృష్ణ, వీరేశ్, సత్యం, వీరన్న, మోహన్‌గౌడ్, తిమ్మప్ప, అనిల్, నరేశ్, డాక్టర్ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు పీహెచ్‌సీ ఆవరణలో గర్భిణులు, రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్, నడిగడ్డ యువత నాయకులు

గద్వాలలో కేక్‌కట్ చేసి తినిపించుకుంటున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతునాయుడు

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

గోపాల్‌పేట, ఏప్రిల్ 15 : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి ఆరు రోజులు జైలు శిక్ష పడింది. ఎస్సై నరేశ్ కుమార్ కథనం మేరకు..మండలంలోని ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతుండగా, పోలీసులు పట్టుకొని వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. వారిని మంగళవారం వనపర్తి కోర్టులో హాజరు పర్చగా, విచారించిన జడ్జి వారికి ఆరు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు

వడ్డేపల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని తనగల గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తున్న వీరేంద్రాచారిపై కేసు నమోదు చేశామని ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపారు. వీరేంద్రాచారితో పాటుగా మరో ఆరు గురిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తున్న, ఆడుతున్న వారి యొక్క సమాచారాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

టిప్పర్లు, డీసీఎం పట్టివేత

ఖిల్లా ఘణపురం, ఏప్రిల్ 15 : మండలకేంద్రం శివారులోని పిల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న భారత్ బెంజ్ టిప్పర్లు, ఒక డీసీఎం, ఒక హిటాచీని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సురేశ్‌గౌడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండలకేంద్రం శివారులోని పిల్లి వాగు నుంచ